కాశీ విశ్వనాథ ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్సవాల నిర్వాహకులు

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ సదానంద్ యాదవ్, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తదితరులు శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చే నెల 21న శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాతబస్తీలోని వివిధ ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఇక్కడి నుంచి బయలు దేరుతాయన్నారు. లాల్‌దర్వాజ మోడ్ ద్వారా నిర్వహించే సామూహిక ఘట స్థాపన ఊరేగింపు కనుల పండువగా కొనసాగుతుందన్నారు. ఊరేగింపు సందర్భంగా లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకుతారన్నారు.

బోనాలకు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తాం

కో ఆర్డినేషన్ సమావేశంలో డీసీపీ స్నేహ మెహ్రా


మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ మండలం డీసీపీ నేహ మెహ్రా అన్నారు. డీసీపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పురానీ హవేలీలోని కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, బోనాల జాతర ఉత్సవాల నిర్వాహకులతో కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధినిర్వాహణలోని తమ పోలీసు సిబ్బందితో ఉత్సవాల నిర్వాహకులు పూర్తిగా సహకరించాలన్నారు. దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్ మాట్లాడుతూ..సాధారణ భక్తులకు ఆటంకాలు కలుగకుండా సంబంధిత ఆలయాల కమిటీ ప్రతినిధులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..బోనాల పండుగ ప్రారంభానికి ముందుగానే ఆయా ఆలయాల వద్ద అవసరమైన మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామన్నారు. దక్షిణ మండలంలోని ఏసీపీలతో పాటు జీహెచ్‌ఎంసీ డీసీలు, ఇంజినీరింగ్ అధికారులు, జలమండలి జనరల్ మేనేజర్ క్రిష్ణ నాయక్ పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాటు చేయాలి..

సప్త మాత్రుకలకు సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాల సందర్భంగా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కోరారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాలకు ఏడు బంగారు పాత్రలో నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని..ఇందులో భాగంగా జులై 7న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే బల్కంటపేట్ ఎల్లమ్మ తల్లి, జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు, విజయవాడ కనక దుర్గమ్మ తల్లి, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం, లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయాల అమ్మవార్లకు భాజా భజంత్రీల నడుమ సామూహిక ఊరేగింపుగా బయలుదేరుతామన్నారు.

బోనాల ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి


లంగర్‌హౌస్‌లో పర్యటిస్తున్న డీసీపీ ఉదయ్‌కుమార్

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జులై 7వ తేదీ నుంచి తెలంగాణ మొదటి బోనం గోల్కొండ జగదాంబిక ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆయన శుక్రవారం ఏసీపీ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లతో కలిసి లంగర్‌హౌస్‌లో పర్యటించారు. ప్రముఖులు హాజరయ్యే ప్రారంభ వేదికతో పాటు, పట్టు వస్త్రాలు సమర్పించే ప్రాంతాలు, పూజలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతు..ఈ సంవత్సరం బోనాల ఉత్సవాల సందర్భంగా మంత్రులతో పాటు, అనేక మంది ప్రముఖులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. కాంత అరవింద్, కారుకొండ చంటిబాబు, ఎస్సైలు రాఘవేంద్ర, రాజు, సత్య నరేందర్, ప్రీతిరెడ్డి ఉన్నారు.

నిలోఫర్ ఆసుపత్రికి భారీగా సీఎస్‌ఆర్ ఫండ్స్


హెచ్‌ఏఎల్ సంస్థతో ఎంఓయూ చేసుకుంటున్న నిలోఫర్ ఆసుపత్రి వైద్యాధికారులు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రికి భారీగా సీఎస్‌ఆర్ ఫండ్స్ మంజూరయ్యాయి. ఈ నిధులను హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ (హెచ్‌ఏఎల్) విడుదల చేయనుంది. ఈ మేరకు శుక్రవారం నిలోఫర్ ఆసుపత్రి, హెచ్‌ఏఎల్ సంస్థ మధ్య ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. ఇందులో భాగంగా ఇరువురు సంస్థల అధికారులు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ విడుదల చేసే సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో రెడ్‌హిల్స్‌లో నిలోఫర్ ఆసుపత్రికి రూ.10.20 కోట్లతో వైద్య పరికరాలను కొనుగోలు చేస్తారు. అలాగే మరో రూ.10.02 కోట్లతో ఓపీడి బ్లాక్ నిర్మాణం చేపడుతారు. ఈ నిధులను నిలోఫర్‌కు రెండు విడతల్లో విడుదల చేస్తారు. ఈ భవన నిర్మాణం అందుబాటులోకి వస్తే అవిభక్త తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఈ సందర్భంగా నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.ఉషారాణి మాట్లాడుతూ..సీఎస్‌ఆర్ ఫండ్స్‌ను మంజూరు చేసిన హెచ్‌ఏఎల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు చేపడుతామని ఆమె వివరించారు. హెచ్‌ఏఎల్, నిలోఫర్ ఆసుపత్రి మధ్య జరిగిన ఎంఓయూ కార్యక్రమంలో హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, నిలోఫర్ ఆర్‌ఎంఓలు అరుణ్‌కుమార్, దాంపూరి రమేష్ పాల్గొన్నారు.

బొగ్గు గనులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం ఆపాలి


లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న బొగ్గు గనులను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం ఆపాలని కోరుతూ సీపీఎం నాంపల్లి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశ ప్రజలు విసిగిపోయారన్నారు. తమ పార్టీకి వత్తాసు పలుకుతున్న దేశంలోని బడా కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం మద్దతిస్తుందని ఆయన ఆరోపించారు. బొగ్గు గనులకు వేలం నిర్వహించి తమకు అనుకూలంగా ఉన్న వారికి వాటిని కేటాయించడం ఈ వేలం ఉద్దేశమని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, హర్షత్, బాలయ్య, సిద్ధయ్య, వెంకటేష్, కృష్ణ తదితరులున్నారు.

'ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చు'


ఎంఎన్‌జే డైరెక్టర్‌కు మెమొంటోను అందజేస్తున్న మీలా జయదేవ్

నాంపల్లి: ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో కేన్సర్ (రాచపుండు)పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రుల్లో మంచి సౌకర్యాలు ఉన్నాయని, రోగులు వారి సౌకర్యాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, హెల్త్ కమిటీ చైర్ పర్సన్ శేఖర్ అగర్వాల్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ భవాని, డాక్టర్ పి.శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు


శిశు మందిర్ పాఠశాల వెనుకాల ఇళ్ల మధ్య పారుతున్న మురుగు


గౌలిపురా మిత్ర క్లబ్ సమీపంలో..

- గౌలిపురాలోని పలు ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సర్దార్ పటేల్‌నగర్, అంబికానగర్, హనుమాన్‌నగర్, గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్, సరస్వతీ శిశు మందిర్ పాఠశాల, బుజ్జాల బావి తదితర ప్రాంతాల్లో గత 20 రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్థానిక ప్రాంతాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో స్థానిక ప్రాంతాల ప్రజలతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. బుజ్జాల బావి సమీపంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో ఈ దారిలో నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను డ్రైనేజీ మురుగునీటిలో నుంచి తీసుకెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించుకుండానే మీ సమస్యను పరిష్కరించడం జరిగిదంటూ మెసేజ్‌లను పంపిస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

సమస్యను పరిష్కరించాలి..



బుజ్జాల బావి సమీపంలో డ్రైనేజీలు 20 రోజులుగా పొంగిపొర్లుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. గతంలో రెండు, మూడు సార్లు డ్రైనేజీకి తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టారు. దీంతో మళ్లీ రెండు రోజులకే తిరిగి యధావిధిగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఈ ప్రాంతంలో శాంతినికేతన్, శ్రీనివాస, జ్ఞాన భారతి, కృష్ణవేణి పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాకపోకలు సాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– ప్రకాశ్, బుజ్జాల బావి, గౌలిపురా

యూసీలను వెంటనే అందజేయాలి


బాలాజీ

చార్మినార్: గతేడాదికి సంబంధించిన బోనాల ఖర్చుల వివరాలతో కూడిన యుటిలైజేషన్ సర్టిఫికెట్(యూసీ)లను వెంటనే అందజేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ తెలిపారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మీరాలంమండి ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాబోయే రెండు రోజుల్లో యూసీలను సబ్మిట్ చేస్తే బోనాల ఉత్సవాల ప్రారంభానికి ముందే ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను అందజేయడానికి వీలు కలుగుతుందన్నారు.


ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి

విజయనగర్‌కాలనీ: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని ఆసిఫ్‌నగర్ మండల ఉపవిద్య పర్యవేక్షణాధికారి మహ్మద్ ముస్తఫా అన్నారు. శుక్రవారం ఆయన విజయనగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను, ప్రవేశాల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను చక్కటి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని అభిప్రాయపడ్డారు. అంతకు ముందు మహ్మద్ ముస్తఫాను ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయుడు డి.రాజు సన్మానించారు.

అనుమానాస్పదంగా సంచరించిన వ్యక్తికి జైలు

డబీర్‌పురా: గంజాయి సేవించి అనుమానాస్పదంగా సంచరించిన వ్యక్తికి 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాకుత్‌పురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్బర్ (37) స్టేషన్ పరిధిలో గంజాయిని సేవించి అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకొని ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని శుక్రవారం 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ టీఆర్.పద్మజా నిందితునికి 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ గ్రేటర్ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా

జియాగూడ: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆశయాలను పునికి పుచ్చుకోవాలని గ్రేటర్ బీఆర్‌ఎస్ మాజీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం పీవీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో ఏర్పాటైన ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్, నర్సింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తా


ట్రాఫిక్ డీసీపీని సత్కరిస్తున్న అరుణ్‌కుమార్, కృష్ణమూర్తి, నవీన్ ముదిరాజ్ తదితరులు

అబిడ్స్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కృషి చేస్తామని నగర ట్రాఫిక్ డీసీపీ–1 రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. నూతన డీసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను రాష్ట్ర కురుమ సంఘం యువజన అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్, బొమ్మరాజు కృష్ణమూర్తి, నవీన్ ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ హెగ్డే మాట్లాడుతూ..ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ట్రాఫిక్ సమస్యలు ఏ మాత్రం ఉండవన్నారు. తూంకుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..సూర్యాపేట ఎస్పీగా విజయవంతగా విధులు నిర్వహించిన రాహుల్ హెగ్డే నగరంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా నివారణకు ఎంతో కృషి చేస్తారని పేర్కొన్నారు.

గోషామహల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కృషి



అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నామని నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సాయికుమార్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షులు కేసీఆర్‌ను ఆయన కలిసి గోషామహల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ముందుందన్నారు.

'కోర్టు ఆదేశాల మేరకు తిరిగి విధుల్లో తీసుకోవాలి'

బహదూర్‌పురా: కోర్టు ఆదేశాల మేరకు తిరిగి తనను విధుల్లోకి తీసుకోవాలని బైరి ప్రేమ్‌కుమార్ కోరారు. బహదూర్‌పురాలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ..ఉస్మానియా ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తనను మెడిసిన్ అమ్ముకున్నాడంటూ నిరాధార ఆరోపణలు చేసి విధుల్లో నుంచి తొలగించారన్నారు. కోర్టులో ఎలాంటి సాక్ష్యాధారాలు చూపించలేకపోవడంతో తన కేసు కొట్టివేశారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తిరిగి తనను విధుల్లోకి తీసుకోకుండా కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తీసుకువచ్చినా సూపరింటెండెంట్ పట్టించుకోవడంలేదని వాపోయారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం


జీఎం జాన్ షరీఫ్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ

అబిడ్స్: తాగునీరు, డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని వాటర్‌బోర్డు 4వ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీతో పాటు గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ భీశ్వ సురేఖ జీఎం.జాన్ షరీఫ్‌తో సమావేశమై పలు సమస్యలు వివరించారు. కార్పొరేటర్ భీశ్వ సురేఖ మాట్లాడుతూ..పలు ప్రాంతాల్లోలో ప్రెజర్, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, డీసిల్టింగ్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. డివిజన్ నలుమూలలా తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భీశ్వ ఓం ప్రకాష్, టింకు, హన్మంతరావు, నిర్మల్‌రాజ్, విజయ్‌సింగ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న ముజీబ్ హుస్సేని, కేఆర్ రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. దాదాపు 500 మందికి పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, ఖురేషి, శ్రీధర్‌నాయుడు ముస్తఫా షరీఫ్, శివకుమార్, చంద్రశేఖర్, హబీబ్ పాల్గొన్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న ఆదర్ల మహేశ్, రవి కుమార్ దంపతులు

గౌలిపురా: గౌలిపురా సీబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయ 7వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, నవగ్రహాల పూజ, లక్ష్మీ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, రవికుమార్ దంపతులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కె.దేవేందర్, కొడి సురేందర్, లవకుమార్, గోవింద్, పురుషోత్తం, ఇందిరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

నైటింగల్ నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి


నర్సింగ్ కౌన్సిల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

సుల్తాన్‌బజార్: నైటింగల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్ నిర్వాహకులు అడ్మీషన్లు తీసుకుని క్లాసులు చెప్పడం లేదని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జీఎన్ఎం విద్యార్థులు శుక్రవారం కోఠిలోని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ విషయమై పలుమార్లు నర్సింగ్ కౌన్సిల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. నైటింగల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఒకే ఒక్క ఫ్యాకల్టీ ఉండి ఆ కళాశాలను నిర్వహిస్తున్న అధికారులు ఒక నోటీసుకే పరిమితమయ్యారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి నర్సింగ్ స్కూళ్లపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ముళ్లపూడి స్మారక పురస్కారం ప్రదానం


పురస్కారాన్ని అందజేస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్‌చంద తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శోభా ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ 94వ జయంతి వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఎంబీఎస్ ప్రసాద్‌కు ముళ్లపూడి వెంకటరమణ స్మార పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్య కార్యదర్శి మోహన్ కంద మాట్లాడుతూ..ముళ్లపూడి వెంకటరమణ రచనలు ఎంతో బాగుంటాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీ నారాయణ, సంస్థ అధ్యక్షురాలు శోభా, సినీ విమర్శకులు ఎస్‌వీ. రామారావు, సినీ దర్శకుడు యాట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న క్రికెటర్ల బొమ్మల ప్రదర్శన



చార్మినార్: పాతబస్తీలో ఎక్కడ చూసినా ఈ నెల 29న ఇండియా–సౌత్ ఆఫ్రికా క్రికెట్ టీంల నడుమ జరుగనున్న టీ–20 వరల్డ్ క్రికెట్ కప్ గురించే చర్చించుకుంటున్నారు యువతీ–యువకులు. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియస్ బుకారి తమ షో రూం వద్ద జాతీయ జెండాలతో కూడిన భారత క్రికెటర్ల బొమ్మలతో కూడిన ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీంతో అటువైపు నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, పాదచారులు, క్రికెట్ అభిమానులు తనివితీరా ఈ ప్రదర్శనను తిలకిస్తున్నారు.

ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన


యూనిఫామ్‌లు అందజేస్తున్న డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ శంకర్‌రాజు

అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యూనిఫామ్‌లను డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భద్రత, సామర్థ్యాన్ని ధ్రువీకరించడానికి డ్రైవింగ్ చేసేటప్పుడు ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు మాట్లాడుతూ.. తరచూ ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ వెస్ట్‌జోన్ ఏసీపీ ధనలక్ష్మి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


యాదగిరి చారి దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ ప్రభుత్వ పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలు వైదేహి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు యాదగిరి చారి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చార్మినార్ మండల ఉప విద్యాశాఖ అధికారి నెహ్రూ బాబు, జంగమ్మెట్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.గిరివర్ధన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డాక్టర్ శ్రీనాథ్, షద్రక్, శ్రీధర్, జబ్బార్ వారిని సన్మానించారు.

వాటర్‌బోర్డు ఎండీకి అభినందనలు



అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డు నూతన ఎండీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. గ్రేటర్‌లో వాటర్‌బోర్డు అభివృద్ధికి, తాగునీటి సరఫరాకు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు విశేష కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎంతో సక్సెస్‌ఫుల్‌గా విధులు నిర్వహించిన అశోక్‌రెడ్డి వాటర్ బోర్డు అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



గోల్కొండ: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ అషాఫ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో మెహిదీపట్నం రైతుబజార్ చౌరస్తా, మెరాజ్ హోటల్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పందంగా ఉన్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే వారు నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు వాహనం నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.